# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ ఆదివారం | 11 జనవరి 2026 | ■ 10 పేజీలు


5



## 'సంక్రాంతి' సందడి

■ ఆదిలాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా ముందస్తు వేడుకలు

■ పతంగులు ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభించిన ఎస్పీ అఖిల్ మహాజన్ ■ సిబ్బంది మధ్య భోగి మంటలు




6లో

# ఎక్కడో పుట్టి... ఇక్కడికి వచ్చి..!

## ఆదివాసీల ఆత్మబంధువు హైమన్ డార్ఫ్

■ ఆధునికాన్ని వదిలి అడవి బిడ్డలతో జీవనం సాగించి.. ■ గిరిజనులతో మమేకమైన డార్ఫ్ ■ ఆయన సేవలు 'గిరిజనం'లో పదిలం

■ మార్లవాయిలో డార్ఫ్ దంపతుల వర్ధంతి ■ ఏర్పాట్లు పూర్తి ■ గిరిజన సంప్రదాయ పద్ధతిలో వేడుకలు ■ హాజరుకానున్న అధికారులు, ప్రజాప్రతినిధులు..

ఆయన ఊరు కాదు.. దేశం కాదు.. ఆయన సంస్కృతి సంప్రదాయమేది కాకున్నా ఖండాలు దాటి వచ్చి ఆదివాసీలతో మమేకమయ్యారు.. ప్రభుత్వ ఫలాలు వారికందేలా ప్రణాళికలు రూపొందించారు. అలా ఆ దంపతులు ఇద్దరు ఆదివాసీ గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.. ఆస్ట్రియా దేశంపు ఆంత్రోపాలజిస్ట్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ వోన్ ఫ్యూరర్ హైమన్ డార్ఫ్ 1940వ దశకంలో అప్పటి హైదరాబాద్ రాష్ట్రం ఆదిలాబాద్‌లోని ఆదివాసీలపై అధ్యయనం చేసి నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు గిరిజనుల సమస్యలను వివరించి వారికి భూమి హక్కులు కల్పించిన మహానీయుడు డార్ఫ్. గిరిజనులపై పరిశోధనకు ఆయన భార్య ఎలిజబెత్ ఎంతగానో సాయపడేది.. స్థానిక గొండు, కొలం తెగల సంస్కృతి సంప్రదాయాలను ఇరువురు తెలుసుకునే వారు. కుమ్రంభీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో నేడు హైమన్ డార్ఫ్ 39వ వర్ధంతిని జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



10

# ఉపాధి హామీపై బీజేపీ 'కుట్ర'

■ ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసి, పేదల పొట్ట కొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చింది

■ గాంధీ పేరు తొలగింపు, పేరు మార్చడం దుర్మార్గం.

■ మహాత్మా గాంధీ పేరును ప్రజల గుండెల్లో నుంచి తుడిచి వేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుంది

■ నిర్మల్ డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

దేశంలో పేదలకు ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పండుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ ధ్వజమెత్తారు. భారతదేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ పేరు తొలగించి రాంజీ పేరు ప్రతిబింబించేలా ఉపాధి హామీ పథకాన్ని మార్చడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకంపై మోడీ ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చి సంపన్నులకు కొమ్ము కాసే విధంగా వివరిస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీ నిబంధనలు మార్చడానికి నిరసిస్తూ దేశవ్యా ప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపడుతుందని 20 నుంచి నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు.



2

# ఉద్యోగాల పేరిట భారీ మోసం

■ నకిలీ నియామకాల ముఠా గుట్టురట్టు చేసిన ఆదిలాబాద్ పోలీసులు ■ ముగ్గురు నిందితుల అరెస్ట్..

■ వందల సంఖ్యలో బాధితులు ■ 5కోట్లు వసూలు ■ విద్యాంజలి స్కీమ్ పేరుతో ఫేక్ అపాయింట్మెంట్ ఆర్డర్లు

■ ఒక్కొక్కరి వద్ద రూ.2.50 లక్షలు వసూలు ■ 240 మందిని ముంచిన 'అనంత్ ఈ సొల్యూషన్' కేటగాళ్లు

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే నిరుద్యోగుల ఆశను పెట్టుబడిగా మార్చుకున్న ఒక భారీ మోసపూరిత ముఠాను ఆదిలాబాద్ పోలీసులు పట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వ 'విద్యాంజలి 2.0' పథకం పేరుతో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ఔట్‌సోర్సింగ్ కొలువులు ఇప్పిస్తామని ఈ ముఠా నమ్మబలికింది. 'అనంత్ ఈ సొల్యూషన్, 'విద్యా దాన్' వంటి నకిలీ సంస్థల పేర్లతో బాధితుల నుండి రూ. 1 లక్ష నుండి రూ.2.50 లక్షల వరకు వసూలు చేశారు. నమ్మకం కుదరడం కోసం బాధితులకు నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి, 3 నెలల పాటు జీతాలు కూడా చెల్లించడం గమనార్హం. ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో సుమారు 240 మంది అభ్యర్థులను ఈ ముఠా మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో జట్టబోయిన మధుకిరణ్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేయగా, ఒక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌ను నిందితుడిగా చేర్చారు. కేంద్ర ప్రభుత్వ సీఎస్ఆర్ నిధులను కాజేయడమే లక్ష్యంగా ఈ ముఠా ఈ అక్రమాలకు పాల్పడిందని ఎస్పీ అఖిల్ మహాజన్ వివరించారు.

## హైమన్ డార్ఫ్ స్ఫూర్తితో

# పేదల కోసం గ్రంథలయం

■ ఉద్యోగ రీత్యా ఆయనో పోలీస్ కానిస్టేబుల్...

■ అడవి బిడ్డల కోసం కృషి చేస్తున్న పోలీస్ అన్న



7

ఉద్యోగ రీత్యా ఆయనో పోలీస్ కానిస్టేబుల్. అటు ఉద్యోగం చేస్తూ... ఇటు సమాజ హితం కోసం పాటు పడుతూ... హైమన్‌డార్ఫ్ బెట్టి ఏలిజీబెత్ స్మారక గ్రంథలయాన్ని ఏర్పాటు చేసి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇంట్లోనే గ్రంథలయం నడుపుతూ ఇంటి ఆవరణలో పచ్చని మొక్కలను పెంచుతూ ప్రకృతితో మమేకమవుతున్నాడు. గోండు జాతిలో పుట్టిన ఆయన తన జాతి ప్రయోజనాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాడు. ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ దుర్వ సంతోష్.

## మాతా శిశు మరణాల

# నివారణే లక్ష్యం

■ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

■ గర్భిణులకు నిరంతర వైద్య పర్యవేక్షణ తప్పనిసరి

■ సంకల్ప్ ప్రాజెక్ట్ వైద్య సేవల్లో మార్పులకు శ్రీకారం

■ రిమ్స్ వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సుదీర్ఘ సమీక్ష సమావేశం

వివరాలు 3లో



# ఉద్యోగాల పేరిట భారీ మోసం

- జూనియర్ కాలేజీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని..
- ఉద్యోగాల పేరిట రూ.5కోట్లు వసూలు...
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో ఉద్యోగాల పేరిట భారీ మోసాలకు పాల్పడుతున్న ముఠాను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన అనంత్ ఈ సొల్యూషన్, విద్యాదాన్ ఎన్జీవో పేర్లతో నిరుద్యోగులను మోసం చేస్తున్న జట్టబోయిన మధు కిరణ్, సుధాకర్, సతీష్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ సీఎస్ఆర్ నిధులు కాజేయాలనే లక్ష్యంతో ఈ నకిలీ నియామకాలు జరిపినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. నిందితుడు 2013లో “అనంత ఈ సొల్యూషను పేరిట కంపెనీని స్థాపించి, ఔట్సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు ఇస్తామని చెప్పేవాడని తెలిపారు.

**కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే సిఎస్ఆర్ నిధులను కాజేయాలనే..**

అనంతరం 2023లో సుజాత ఠాకూర్, నామిని సతీష్, లావణ్యలతో కలిసి “విద్యాధాన్ ఆర్గనైజర్సు అనే సొసైటీని రిజిస్టర్ చేసి, కేంద్ర ప్రభుత్వ విద్యాంజలి 2.0 స్కీమ్ డబ్బులు దుర్వినియోగం చేయాలని అన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే సిఎస్ఆర్ నిధులను కాజేయాలనే దురుద్దేశంతో, ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని అబద్ధాలు చెప్పి నిరుద్యోగులను నమ్మబలికి, నకిలీ ఉద్యోగాలను వివిధ ప్రభుత్వ పాఠశాలలో మరియు కళాశాలలో వచ్చేలా చేసినట్లు విచారణలో తేలిందన్నారు.

**జూనియర్ కాలేజీల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తామని..?**

అదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, ఉమ్మడి వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో ఏజెంట్ల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ1,00,000/- నుండి రూ.2,50,000/- వరకు వసూలు చేసి, నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇచ్చారన్నారు. మొత్తం వందల సంఖ్యలో నిరుద్యోగులను మోసం చేసినట్లు తేలిందన్నారు. ఈ ముఠా రాష్ట్ర వ్యాప్తంగా 240 మంది అభ్యర్థులను మోసం



చేశారన్నారు. వీరు నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్లతో ఉద్యోగాలు కల్పించి వారికి 3 నెలలు వేతనం అందించిన తర్వాత వేతనం అందకపోయేసరికి బాధితులు వివిధ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా..

**ఇంకా ఎవరి పాత్ర ఉన్నదనే అంశంపై విచారణ చేస్తున్నాం : ఎస్పీ అఖిల్ మహాజన్**

వీరికి సహకరించిన ఏజెంట్లుగా ఉన్నటువంటి రాహుల్, కోవా విటల్ (బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్) వరలక్ష్మలపై ఇదివరకే పల్స్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు పేర్కొన్నారు. నిందితులను పోలీస్ కస్టడీలోకి తీసుకొని ఇంకా ఎవరి పాత్ర ఉన్నదనే అంశంపై విచారణ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్, ఎస్సైలు గోపికృష్ణ, నాగనాథ్, అశోక్ పాల్గొన్నారు.







# ఓపెన్ కాస్ట్ నూతన ప్రాజెక్టులు ప్రారంభించేలా చర్యలు

**సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు**

**తాండూర్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఏరియా వైభవానికి తన వంతు కృషి చేస్తున్నానని సింగరేణి (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. త్వరలో ఖైరిగూడా ఓపెన్ కాస్ట్ మూసివేతకు గురవుతుండగా అంతలోపే నూతన ప్రాజెక్టులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటు న్నామని వెల్లడించారు. మహావీర్ ఖని ఓపెన్ కాస్ట్ ప్రతిపాదిత ప్రాంతాలను బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డితో కలిసి శనివారం ఎంవీకే-1, 2, 3, 5, 6 మూసివేసిన గనుల ప్రాంతాలను, మాదారం టౌన్ షిప్, నర్సాపూర్ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ ఏర్పాటుకు



వస్తున్న అడ్డంకులు, అనుకూల అంశాలపై స్థానిక అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన ప్రాజెక్టులతోనే ఏరియాకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఓపెన్ కాస్ట్‌ల ఏర్పాటుకు అందరూ సహకరించాలన్నారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతలో ఒడిదుడుకులు ఎదుర్కొంటుందని, సాధ్యమైనంతవరకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, నాణ్యమైన బొగ్గు వెలికి తీసేందుకు అందరూ సమన్వయంతో సహకరించాలన్నారు. మొదటిసారి మాదారానికి వచ్చిన డైరెక్టర్ ను నాయకులు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ కుష్ణపెల్లి లక్ష్మణ్, ఉపసర్పంచ్ దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ సత్కరించారు.ప్రాజెక్టు మేనేజర్ మహేష్ సిబ్బంది ఉన్నారు.



# రూ. 5 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టిన రైతులు

**ఖానాపూర్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**

ఆ గ్రామంలో రైతులందరు ఒక్కటై స్వచ్ఛందంగా రోడ్డు నిర్మాణం చేసుకున్నారు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తలో చెయ్యి వేసి శ్రమదానం చేశారు. దాదాపు రూ. 5 లక్షలు స్వంత డబ్బులు ఖర్చు చేసుకొని రోడ్డును వేసుకున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సూర్జపూర్, మేడంపల్లి గ్రామలకు చెందిన రైతులు అందరు కలిసి తోడుతో తోడుగా ఏకమై తన పంట పొలంలోకి వెళ్ళడానికి మట్టి రోడ్డు వేసుకున్నారు. ఖానాపూర్ మండల రైతుల జీవనదారం అయిన సదర్మాట్ ఆయకట్టు కింద సూర్జపూర్, మేడంపల్లి రైతులు తమ పంట పొలంలోకి వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారు.

**15మంది రైతులు ఏకమై రూ. 5 లక్షల వ్యయంతో...**

పొలాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేదు. దీనితో అందరు కలిసి మాట్లాడుకున్నారు. నాయకులకు చెప్పుకుంటే ఇప్పుడే పని కాదని చర్చించుకొని, వారే తల కొంత డబ్బులు పోగు చేసుకున్నారు. ఇంకేముంది పనులు ప్రారంభం చేశారు. ట్రాక్టర్‌తో మొరం పోయించారు. రైతులందరూ కలిసి శ్రమదానం చేశారు. రైతులు బూసి నారాయణ, భూక్యా గోవింద్, గుగ్లావత్ రాజేందర్, కందుకూరి వెంకటి తో సహా 15మంది రైతులు ఏకమై రూ.5 లక్షల వ్యయంతో మేడంపల్లి గ్రామ సమీపంలోని మామిడితోట ఏరియాలో సదర్మాట్ కాలువ నుండి గోదావరి వరకు రెండు కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డు వేసుకున్నారు. ప్రభుత్వం ఇట్టి రైతులకు రోడ్డు మర్మతుల కోసం నిధులు మంజూరు చేయాలిని ఆ రైతులు కోరుతున్నారు.

## గడ్డివాము దగ్ధం

**జన్నారం, జనవరి 10 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండల కేంద్రంలో గల ఆర్య వైశ్య కల్యాణ మండపం సమీపంలోని ఉడుతల రాజన్న గడ్డివాము ప్రమాదవషాత్తు అగ్నికి అహుటాయ్యింది విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారి దేవనంది శ్రీనివాస్ తన సిబ్బందితొ కలిసి సంఘటన స్థలానికి చేరుకొని మంటలర్పే ప్రయత్నం చేసారు కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని పదివేల రూపాయలు నష్టం జరిగిందని ఉడుతల రాజన్న వాపోయాడు



## రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కిష్టాపూర్ విద్యార్థిని ఆకుల అనన్య ఎంపిక

**జన్నారం, జనవరి 10 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఆకుల అనన్య 9వ తరగతి విద్యార్థిని ఒలంపియాడ్ లో ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయికి సెలెక్ట్ అవడం జరిగింది మరియు జూనియర్స్ విభాగం ఉపన్యాస పోటీల్లో ఏడో తరగతి అమ్మాయి ఆకుల అనుశ్రీ జిల్లాలో రెండవ స్థానం సాధించింది విద్యార్థినులతో పాటు గైడ్ టీచర్ డి.మణెమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ గుండ రాజన్న ఆంగ్ల భాష ఉపాధ్యాయులు దాముక కమలాకర్, బానావత్ ప్రకాష్ పాఠశాల ఉపాధ్యాయులు జాడి మురళి,గోవర్ధన్, రాజన్న,



బుచ్చి లింగయ్య, నగేష్, జ్యోతిశీల. నరహరి శర్మ, కాంతయ్య శ్రీనివాస్, రజిత రాణి, సుస్మిత, అజీమ్. స్వప్న తదితరులు అభినందించారు.

# పారిశుద్ధ్య పనులు చేపట్టిన గ్రామ పంచాయతీ

**జైనూర్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండలం జంగాం గ్రామంలోని అందుగూడ గ్రామ సర్పంచ్ అనూసయా-అర్జున్ ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు.అందుగూడ డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయి మురుగు నీరు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండడంతో డ్రైనేజీలలోని పూడికను తీయించారు. సర్పంచ్ అనుసయా-అర్జున్ ఉప సర్పంచ్ సజ్జద్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు



# మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
మాతా శిశు మరణాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచెయ్యాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శనివారం ఆదిలాబాద్ రిమ్స్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రసూతి వైద్య సేవలు, టీఫా స్కానింగ్,108 వాహన సేవలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని, ఈ సంవత్సరంలో మాత శిశు మరణాలను పూర్తిగా నివారించి, సంకల్ప ప్రాజెక్ట్ ద్వారా 2027 నాటికి నవజాత శిశువుల మరణాల రేటును సింగిల్ డిజిట్‌కు తగ్గించాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని.. తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడటానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

**మాతా శిశు మరణాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా...**
మాతా శిశు మరణాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా వైద్యులు,సిబ్బంది పనిచెయ్యాలని ఆదేశించారు. రిమ్స్ ఆసుపత్రికి వచ్చే గర్భిణీల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని,మాతా శిశు మరణాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు ఆసుపత్రిలో చేరినప్పటి నుండి,డెలివరీ చేసే ముందు, ప్రసవ సమయంలో ప్రసవం జరిగిన తర్వాత కూడా నిరంతర వైద్య పర్యవేక్షణ ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కార్డియాలజీ, రేడియాలజీ, గైనకాలజీ విభాగాలు పరస్పర సహకారంతో పనిచేయాలన్నారు. గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడానికి టిఫా, స్కానింగ్‌లు అత్యంత కీలకమని, దీనిపై రేడియాలజీ విభాగం అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ, రేడియాలజీ విభాగాలు పటిష్ట నిఘా ఉంచాలన్నారు.

**స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి..**
స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, కేసులు, హాజరు, ఇతర సమస్యలను పరిష్కారానికి హెచ్‌ఓడీలు, డ్యూటీ డాక్టర్లు, పీజీలు, సీనియర్ రెసిడెంట్లు సమన్వయంతో పని చేయాలన్నారు. అత్యవసర సమయాల్లో 108 వాహన సేవలు సకాలంలో అందేలా చేసుకోవాలని సూచించారు. వైద్యులు, స్టాఫ్ నర్సులు తమ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేస్తూ, రోగులకు భరోసా కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి సాధన, వైద్యులు అనంత రావు, దీపక్, రేడియాలజీ విభాగాధిపతి కళ్యాణ్ రెడ్డి, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముందస్తు సంక్రాతి సంబరాలు

**జన్నారం, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
జన్నారం పట్టణంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో సంప్రదాయాలకు ప్రతీకగా గ్రామీణ సంస్కృతిని సజీవంగా రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా వివిధ వృత్తుల పనులను స్టాల్స్ రూపంలో ఏర్పాటు చేసి, వాటి ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. భోగి పండుగ సందర్భంగా భోగి మంటలు, భోగి పండ్లు, గంగిరెద్దులు, ఎడ్లబండ్లు, రైతు చేసే పనులు, వ్యవసాయానికి సంబంధించిన సంప్రదాయాలు వంటి అంశాలను ప్రత్యక్షంగా చూపిస్తూ పిల్లలకు అవగాహన కల్పించారు. ప్రతి స్టాల్ వద్ద పిల్లలు చురుకుగా పాల్గొని, గ్రామీణ జీవన విధానం, రైతు ప్రాముఖ్యత, సంప్రదాయ పండుగల విలువలను ఆనందంగా నేర్చుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై ప్రేమ, గౌరవం పెంపొందించాలనే ఉద్దేశ్యంతో పాఠశాల యాజమాన్యం ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కస్తూరి సతీష్ కుమార్ మాట్లాడుతూ, పండుగలు కేవలం ఆనందానికే కాకుండా మన సంస్కృతి, జీవన విలువలను పిల్లలకు చేరువ చేసే సాధనమని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల సర్వాంగీణ అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. సంక్రాంతి సంబరాల కార్యక్రమం లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఉత్సాహభరితంగా పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వావిలాల రాజేందర్ ,లయన్స్ క్లబ్ సభ్యులు అంజితరావు, సైన్ల మల్లేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## జైనథ్ ఆలయ అభివృద్ధికి
# నిధులు మంజూరు
### రూ.1 కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులు

**ఆదిలాబాద్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
ప్రాచీన జైనథ్ శ్రీ లక్ష్మ నారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆలయం, కోనేరు అభివృద్ధి కోసం రూ.1 కోటి 50 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి ఆయన సమీక్షంచి, ఆలయ పరిసరాలు, కోనేరు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్, ఆలయ కమిటి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కరించాలని ఎంపీకి వినతి

**ఆసిఫాబాద్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గెడం నగేష్ ను శనివారం ఆయన నివాసంలో జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాన్ని అందజేశారు. కెరమెరి మండలంలోని ఉమ్రి క్రాస్ రోడ్ నుంచి పరంధోలి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయించేలా చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే పరంధోలి, ముకదంగూడ గ్రామపంచాయతీలకు త్రీఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శంకర్ లొొద్ది, మహారాజ్ గూడ గ్రామాల్లో ఎదురవుతున్న మొబైల్ సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు.



# పురుగుల మందు తాగి యువకుడి బలవన్మరణం

**లక్షెట్టిపేట, జనవరి 10 (ప్రభాత సమాచారం)**



పురుగుల మందు తాగి వ్యక్తి మృతి.. మున్సిపాలిటీలోని పరిధిలోని గంపలపల్లికి చెందిన అగ్గు రమేష్ ( 32) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని చికిత్స పొందుతూ శనివారం కరీంనగర్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతునికి మానసిక పరిస్థితి బాగోలేక గత పది సంవత్సరాల నుండి కరీంనగర్‌లోని ప్రశాంతి ఆసుపత్రిలో వైద్యులకు చూయించుకొని మందులు వాడుతున్నాడన్నారు. మందులు వాడిన తన మానసిక పరిస్థితి బాగుపడలేదన్నారు. తరచుగా ఆయనే చనిపోతానని అందరం ఒకసారి చనిపోయే వాళ్ళమే అంటూ చెప్పేవాడని, గత కొన్ని సంవత్సరాల క్రితం ఇలానే అంటూ ఆత్మహత్యకు పాల్పడగా.. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రిలో చికిత్స చేయించారన్నారు.

**కుటుంబ సభ్యులకు మందు తాగిన విషయం చెప్పడంతో...**
అదే క్రమంలో ఈనెల 8న ఉత్కూర్ శివారులోని వాళ్ళ సొంత పొలంలో గడ్డికి కొట్టే మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకొని కుటుంబ సభ్యులకు మందు తాగిన విషయం చెప్పడంతో కుటుంబీకులు స్థానికుల సాయంతో తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. మృతుని భార్య పెంకర్ల ప్రోనూష అలియాస్ అగ్గు లక్ష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

**లక్షెట్టిపేట, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి.. మండలంలోని గుల్లకోట గ్రామ శివారులోని రహస్య ప్రదేశంలో కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ గోపతి సురేష్ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించి పలువురిని అరెస్ట్ చేసినట్లు శనివారం సాయంత్రం ఎస్సై తెలిపారు. కోడిపందాలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులతో పాటు ఒక కోడి, రూ.900 నగదును స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారన్నారు. అరెస్ట్ చేసిన వారిలో పసుపునుటి సాయి, గుర్రాల శ్రీకాంత్, సుందిళ్ల సురేష్, కారుకూరి అనిల్, అక్కల గణేష్, ఎర్ర వేణి గణేష్ ఉన్నారు.

# ఆటో డ్రైవర్లకు లైసెన్సులు అందజేత

**పెంచికల్‌పేట్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
మండలంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న ఆటో డ్రైవర్లను గుర్తించిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్హులైన డ్రైవర్లకు లైసెన్సులు జారీ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.





# రేషన్ బియ్యం పట్టివేత

## ఇద్దరిపై కేసు నమోదు

**వేమనపల్లి, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని ముల్కల పేట బస్ స్టాప్ వద్ద శనివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. టాటా ఏసీ ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న టాటా ఏసీ ట్రాలీ వాహనాన్ని సీజ్ చేసి, అట్టెల రవి, భాగాల భీమేష్‌పై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై డిపార్ట్మెంట్‌కు అప్పజెప్పడం జరిగిందని, గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి పక్కనే ఉన్న మహారాష్ట్రలో అధిక ధరకు అమ్ముతున్న దళారులపై కేసులు నమోదు చేస్తామని ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని ఎవరైనా అమ్మిన, కొనుగోలు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

# బిఎంఐ జిల్లా కన్వీనర్‌గా విజయ



**ఆసిఫాబాద్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకు వెళ్తున్న భీమ్ మిషన్ ఐడియాలజీ (బిఎంఐ) కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్‌గా కుసుమ విజయను నియమించారు. హైదరాబాద్‌లోని బిఎంఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దామాల సర్సయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మ నారాయణలు కుసుమ విజయకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు దామా ల సర్సయ్య మాట్లాడుతూ... ఆసిఫాబాద్ జిల్లాలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బిఎంఐ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో యూత్ విభాగం, మహిళా విభాగం, కల్చరల్ విభాగం వంటి కమిటీలను కూడా నియమించుకోవాల ని తెలిపారు. దళిత సమాజాన్ని విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బలోపేతం చేయడమే లక్ష్యంగా బిఎంఐ పనిచేస్తోందని పేర్కొన్నారు. జిల్లా యువత, మహిళలను భాగస్వాములుగా చేసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై సదస్సును నిర్వహించినున్నట్లు తెలిపారు.

# కవి సమ్మేళనం నిర్వహించాలి

**ముథోల్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం సంక్రాంత్రి పండుగను పురస్కరించుకొని కవి సమ్మేళనం ఏర్పాటు చేయాలని తెలంగాణ తెలుగు కళానిలయం అధ్యక్షులు, కవి జాధవ్ పుండలిక్ రావు పాటిల్ కోరారు. మన పండుగలు భారతీయ సంస్కృతికి ప్రతికలు ఇటువంటి పండుగలా ఔన్నత్యాన్ని తెలియజేయటానికి కవి సమ్మేళనాలు దోహదపడతాయని, మరోవైపు తెలుగు భాష పరిరక్షణకు కవి సమ్మేళనాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల్లో తెలుగు మాధుర్యాన్ని, గొప్పతనాన్ని తెలియజేయడానికి కవి సమ్మేళనాలు ఉపయోగపడుతాయి. ఆకాశవాణి అదిలాబాద్ కేంద్రం అధికారులు కవి సమ్మేళనాలకు శ్రీకారం చుట్టాలన్నారు.

# వాహనదారులకు పువ్వులతో అభినందనలు తెలిపిన అధికారులు







**ఆదిలాబాద్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
రహదారి నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనాలను నడిపే చోదకులను ఆర్టీవో అధికారులు వినూత్నంగా అభినందించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖాధికారులు ఆదిలాబాద్ ట్రాఫిక్ పోలీసులతో కలిసి పట్టణంలోని కూడళ్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనదారులకు శనివారం ఆదిలాబాద్ పట్టణంలో వినూత్న రీతిలో అభినందనలు లభించాయి. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక కలెక్టర్ చౌక్ వద్ద రవాణా, ట్రాఫిక్ పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులు, సీట్ బెల్ట్ పెట్టుకున్న కార్ల డ్రైవర్లను గుర్తించి, పాఠశాల విద్యార్థుల చేతుల మీదుగా వారికి పూలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, వాహనదారులు తమ ప్రాణ రక్షణ కోసమే నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీటు బెల్టు ధరించే అలవాటును నిరంతరం కొనసాగించాలన్నారు. ప్రయత్నాన్ని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు హరేంద్ర కుమార్, టి. రంజిత్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్, మహేంద్ర పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలతో నిర్మల్ పేరు నిలబెట్టాలి



**ముథోల్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించి నిర్మల్ జిల్లాను అగ్ర పదంలో నిలపాలని బిజెపి నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ఎస్టియు టీఎస్ ఉపాధ్యాయ సంఘం నేతలు మహేశ్వరుని కలిసి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. అనంతరం 2026 డైరీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయ సంఘాలు పోటీపడి పని చేయాలని సూచించారు. ఉపాధ్యాయులకు సమస్యలు పై మీరు చేసిన పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు భూమున యాదవ్, ప్రధాన కార్యదర్శి జి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీదే విజయం

## కార్యకర్తల సమావేశంలో బిజెపి నేత మహేశ్వర్ రెడ్డి




**నిర్మల్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో నిర్మల్ జిల్లాలో మూడు మున్సిపాలిటీలను బిజెపి కైవసం చేసుకుంటుందని బిజెపి నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో బూతు స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, బూత్ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేస్తూ పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాలి. ప్రతి బూత్‌ను కార్యకర్తల ఆధారంగా బలమైన, క్రమబద్ధమైన యూనిట్‌గా తీర్చిదిద్దుతూ, ప్రజలతో నిరంతరంగా మమేకమై, పార్టీ విధానాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు బీజేఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి గారు సూచించారు. ప్రజలతో నిత్య సంబంధం, ప్రతి ఇంటికి పార్టీ విధానాలు చేరేలా వ్యవస్థీకృత పని విధానం, బూత్ స్థాయిలో బాధ్యతాయుత నాయకత్వం ఎలా నిర్మించాలనే అంశాలపై దిశానిర్దేశం చేశారు.



## సాగు, తాగు నీటి సమస్య

# పరిష్కారానికి మంత్రి భరోసా

## డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్

**ఆదిలాబాద్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా ప్రజల సాగునీరు, తాగునీరు సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా కల్పించారని ఆదిలాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ తెలిపారు. శనివారం హైదరాబాదులో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ రెడ్డితో కలిసి మంత్రిని కలిసిన సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు ముఖ్యమైన నీటి సమస్యలు, చెరువులు, సాగునీటి ప్రాజెక్టులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా మంత్రితో చర్చ జరిగిందన్నారు. ముఖ్యంగా కుప్టి ప్రాజెక్టు, చనకా- కొరట ప్రాజెక్టుల నిర్మాణం, అభివృద్ధి పనుల మంజూరుకు సంబంధించి వినతిపత్రాన్ని మంత్రివర్యులకు అందజేశామన్నారు. ఈ విషయాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి వసతుల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపారన్నారు. సంబంధిత ప్రాజెక్టులకు అవసరమైన మంజూరులు ఇచ్చి, నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

# ఉపాధ్యాయుల టెట్ రద్దుకు కృషి చేస్తాం

**నిర్మల్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ రద్దు అయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఇవాళ పీఆర్టీయు టీఎస్ 2026 డైరీని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని, ఈ విషయం కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

# హెడ్ క్వాటర్స్‌లో సంక్రాంతి సంబరాలు

- పిల్లలకు పతంగులు, మహిళ సిబ్బందికి ముగ్గుల పోటీల నిర్వహణ
- స్వయంగా పతంగులు ఎగరేసి సంక్రాంతి వేడుకలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ
- చైనా మాంజా, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి
- ముగ్గుల పోటీలో మొదటి మూడు విజేతలకు బహుమతులు
- భోగి మంటలు వెలిగించి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు
- నిత్యం విధులతో ఉండే పోలీసు సిబ్బందికి విశ్రాంతిని కల్పించే విధంగా ఈ ఉత్సవాల నిర్వహణ జరిపారు



**ఆదిలాబాద్, జనవరి 10 (ప్రభాత సమాచారం)** రానున్న సంక్రాంతి సందర్భంగా ఆదిలాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు జిల్లా పోలీసు సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు హెడ్ క్వార్టర్స్ లోనే ముందుగా సిబ్బంది సమక్షంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది అధికారులు కిందిస్థాయిలోని పై స్థాయి అధికారులు సంతోషంగా కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగ సంబరాలను జరుపుకున్నారు. స్వయంగా జిల్లా ఎస్పీ మరియు అధికారులు సిబ్బంది సమక్షంలో పతంగులైన





ఎగురవేసి సంక్రాంతి ఉత్సవాలను ప్రారంభించారు. జిల్లా ప్రజలందరికీ చైనా మాంజా వినియోగించకుండా ఉండాలని సూచించారు. నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలుగా నిలిచిన మహిళ పోలీసు సిబ్బందికి అభినందనలు తెలియజేసి, బహుమతులను అందజేశారు. సిబ్బంది సమక్షంలో భోగిమంటలు వెలిగించి రానున్న పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కాజల్ సింగ్, బి సురేందర్రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సిఐలు ఎస్ఐలు పోలీసు సిబ్బంది మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాంజీ పేరును వ్యతికిస్తున్నాం : డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి



**మందమర్రి, జనవరి 10 (ప్రభాత సమాచారం)** దేశ వ్యాప్తంగా పేదల జీవనోపాధికోసం గతంలో కేంద్రంలోని తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును తొలగిస్తూ రాంజీ పేరు పెట్టడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ పా ర్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మంద మర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం లోని మోదీ ప్రభుత్వం తమ పార్టీని టార్గెట్ చేయడంతో పాటు నాయ కులపై అక్రమ కేసులు పెట్టడం అలవాటుగా మారిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలకపాత్ర పోషించిన మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకంతో ఎంతో మంది వంద రోజుల పని దొరుకుతూ ఆకలి తీర్చుకుంటున్నారని, రాంజీపథకం ఎందుకు పెడుతున్నారో జవాబు చెప్పడం లేదన్నారు. ఇప్పటికే తమ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరికి సంబంధించి పెద్ద ఎత్తున ప్రజలను చైతన్యం చేస్తున్నాడని దీనిని కూడ ప్రజలు ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై తాము కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ బీవీ రాంజిచట్టం రద్దు చేయాలని కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ చట్టంపై కేంద్రం కుట్ర

**శ్రీరాంపూర్, జనవరి 10 (ప్రభాత సమాచారం)** సీపీఐ వందేళ్ల ప్రస్థానం పేదలు, బడుగు, బలహీన వర్గాల హక్కుల పోరాట చరిత్రని జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ఇవాళ సీపీఐ 100 సంవత్సరాల పైలాన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

## ఇండ్ల నిర్మాణ పనులు జరిగేలా చూడండి

**సాత్నాల, జనవరి 10 (ప్రభాత సమాచారం)** సాత్నాల మండలం దుబ్బగూడా ఆదివాసీల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ శాఖ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని, వాటిని తొలగించి నిర్మాణాలు జరిగేలా చూడాలని అఖిలపక్ష నాయకులు ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కోరారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం లేతుబాయి అనే మహిళ ఒక ఎకరం భూమిని దానం చేశారని, అయితే ఆ భూమి అటవీ పరిధిలోకి వస్తుందని అధికారులు నిర్మాణాలను అడ్డుకుంటున్నారని వారు తెలిపారు. అటవీ శాఖ అధికారులు పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని వారు విజ్ఞప్తి చేశారు.





## గుడుంబా పట్టివేత.. ఒకరిపై కేసు నమోదు

**వేమనపల్లి, జనవరి 10 (ప్రభాత సమాచారం)** మండల కేంద్రానికి గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. దహేగం మండలానికి చెందిన భానోత్ ఆనంద్ తన బ్యాగుని తనిఖీ చేయగా.. 15 లీటర్ల గుడుంబా పట్టుబడింది. వెంటనే గుడుంబా స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. మండలంలో ఎవరైనా మత్తుపదార్థాలు, మద్యం, గుడుంబా, ఇతర నిషేధిత పదార్థాలు అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

# చంద్రవెల్లిలో ఎఫ్‌పీఓ సభ్యత్వ నమోదు



**బెల్లంపల్లి, జనవరి 10 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి పీఏసీఎస్ (ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ) ఆధ్వర్యంలో అంకుశం గ్రామ పంచాయతీలో ఎఫ్‌పీఓ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. అడాప్షన్ ఆఫీసర్ బి. సురేందర్ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా రైతులు ఎఫ్‌పీఓలో సభ్యులుగా చేరి, సమూహంగా వ్యవసాయం చేయడం ద్వారా ఆర్థికంగా లాభాలు పొందే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఎఫ్‌పీఓ లక్ష్యాలు, ప్రయోజనాలు వివరించారు. రెండు వేల రూపాయల సభ్యత్వ ఫీజు చెల్లించి 10 మంది రైతులు సభ్యత్వం పొందారు. అంకుశం గ్రామ పంచాయతి సర్పంచ్ బొంతల అరుణ చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొప్పుల భానుచందర్, చంద్రవెల్లి పీఏసీఎస్ కార్యదర్శి, సిబ్బంది, సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఎక్కడో పుట్టి... ఇక్కడికి వచ్చి..!

## ఆదివాసీల ఆత్మబంధువు హైమన్ డార్ఫ్





- ఆధునికాన్ని వదిలి అడవి బిడ్డలతో జీవనం సాగించి..
- గిరిజనులతో మమేకమైన డార్ఫ్
- ఆయన సేవలు 'గిరిజనం'లో పదిలం
- మార్లవాయిలో డార్ఫ్ దంపతుల వర్ధంతి
- ఏర్పాట్లు పూర్తి
- గిరిజన సంప్రదాయ పద్ధతిలో వేడుకలు
- హాజరుకానున్న అధికారులు, ప్రజాప్రతినిధులు..

**ఆయన ఊరు కాదు.. దేశం కాదు.. ఆయన సంస్కృతి సంప్రదాయమేది కాకున్నా ఖండాలు దాటి వచ్చి ఆదివాసీలతో మమేకమయ్యారు.. ప్రభుత్వ ఫలాలు వారికందేలా ప్రణాళికలు రూపొందించారు. అలా ఆ దంపతులు ఇద్దరు ఆదివాసీ గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.. ఆస్ట్రియా దేశంపు ఆంత్రోపాలజిస్ట్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ వోన్ ఫ్యూరర్ హైమన్ డార్ఫ్ 1940వ దశకంలో అప్పటి హైదరాబాద్ రాష్ట్రం ఆదిలాబాద్‌లోని ఆదివాసీలపై అధ్యయనం చేసి నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు గిరిజనుల సమస్యలను వివరించి వారికి భూమి హక్కులు కల్పించిన మహనీయుడు డార్ఫ్. గిరిజనులపై పరిశోధనకు ఆయన భార్య ఎలిజబెత్ ఎంతగానో సాయపడేది.. స్థానిక గొంగు, కొలం తెగల సంస్కృతి సంప్రదాయాలను ఇరువురు తెలుసుకునే వారు. కుమ్రంభీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో నేడు హైమన్ డార్ఫ్ 39వ వర్ధంతిని జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.**

**జైనూర్, జనవరి 10 (ప్రభాత సమాచారం)** ఆదివాసీల ఆత్మబంధువు, మానవ పరిణామ శాస్త్రవేత్త దివంగత ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ నిలిచారు. అడవి బిడ్డల స్థితిగతులను అధ్యయం చేయడానికి డార్ఫ్ దంపతులు కుమరంభీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. వారి సమస్యల పరిష్కారానికి ఎంతో కృషిచేసి గిరిజనుల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారు. ఆదివారం హైమన్ డార్ఫ్ వర్ధంతి సందర్భంగా మార్లవాయి గ్రామంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. హైమన్ డార్ఫ్ ఆస్ట్రియా దేశం వియన్నా నగరంలో 1909లో జన్మించారు. 1930లో లండన్ విశ్వవిద్యాలయం నుంచి మానవ పరిణామ శాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందారు. బ్రిటీష్ పాలనలో కెరమెరి మండలం జోడేఘాట్ అటవీ ప్రాంతంలో కుమరంభీం ఆధ్వర్యంలో నిజాం సైనికులకు, గోండులకు మధ్య తీవ్ర పోరాటం జరిగింది. ఈ పోరాటంలో కుమరభీం అసువులుబాశారు. ఈ నేపథ్యంలో ఆదివాసీలు తిరుగుబాటుకు కారణాలను పరిశోధించడానికి నిజాం ప్రభుత్వాలు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్‌ను ఆదిలాబాద్ జిల్లాకు పంపించింది. ఆయన తన సతీమణి బెట్టి ఎలిబిబెత్‌తో వచ్చి జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో స్థిరపడ్డారు. ఆదివాసీల జీవితాలను పరిశోధించడమే కాకుండా వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఆదివాసీల అభివృద్ధికి సూచనలు చేయడమే కాకుండా పలు ప్రామాణిక గ్రంథలు రాశారు. 'ది గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్' అనే గ్రంథంలో ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను పొందుపరిచారు. శక్తి వంచన లేకుండా పరిశోధన చేసి ఆదివాసీలకు భూమి, అడవి, నీటపై పూర్తి అధికారాలు ఉండాలని ఆ గ్రంథంలో సూచించారు. డార్ఫ్ నిజాం సర్కారుకు ఆదివాసీల జీవన విధానం, ఉద్యమాలను నిజాం సర్కారుకు నివేదించడంతో ఆదివాసీలకు సర్వ హక్కులు కల్పించారు. దీంతో ఆదివాసీలు డార్ఫ్ దంపతుల వర్ధంతిని యేటా జనవరి 11న సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో డార్ఫ్ దంపతుల విగ్రహాలకు ఆదివాసీ ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా నివాళి అర్పించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

# రేపే ఓటరు తుది జాబితా

- ముగిసిన అభ్యంతరాల స్వీకరణ
- మూడు మున్సిపాల్టీల్లో 1380 దరఖాస్తులు
- సవరించి జాబితాను విడుదల చేయనున్న అధికారులు

**ముథోల్, జనవరి 10 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాల్టీలలో జనవరి 1వ తేదీన ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో? లేవోనని తెలుసుకొనేందుకు ఓటర్లు, నాయకులు, పోటీ చేసే ఆశావహులు తమ ఓటర్ల కోసం వెతుకుతున్నారు. ఖానాపూర్ మున్సిపాల్టీలో ముసాయిదా జాబితా పూర్తిగా సవరించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. నిర్మల్, భైంసాలలో ఆయా పార్టీల నేతలు, నాయకులతో ముసాయిదా ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించగా తప్పుల తడక జాబితాతో అధికారులను ఆయా పార్టీల నేతలు నిలదీశారు. ఒక వార్డులోని ఓటర్లు ఇతర వార్డులోకి.. ఇతర గ్రామాల ఓటర్లు మరో వార్డులోకి.. ఇతర జిల్లాల ఓటర్లు పట్టణాలలో ప్రత్యక్షమవ్వడంతో అందరూ కంగుతిన్నారు.

**మూడు మున్సిపాల్టీలో 1,67,100 ఓటర్లు...**

నిర్మల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీలలో 1,67,100 మంది ఓటర్లు ఉన్నారు. నిర్మల్ ప ట్టణంలో 42 వార్డులు.. 98, 295 ఓటర్లు ఉన్నారు. ఇందులో 50,878 మంది మహిళలు, 47,399 పురుషులు, ఇతరులు 18 మంది ఉ న్నారు. భైంసాలో 26 వార్డుల్లో 51,118 మం ది ఉన్నారు. ఇందులో మహిళలు 25,623, పురుషులు 25,486, ఇతరులు 9 ఉన్నారు. ఖానాపూర్‌లో 12 వార్డులకు గాను మొత్తం 17, 693 మంది ఓటర్లు ఉండగా పురుషులు 8524, మహిళలు 9169 ఉన్నారు.

**1380 అభ్యంతరాల స్వీకరణ...**

నిర్మల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీలలో ఈనెల 1వ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలో ఏవైన అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదులు అందించాలని మున్సిపాల్టీలలో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి అభ్యంతరాలను శుక్రవారం రాత్రి వరకు స్వీకరించారు. మూడు మున్సిపాల్టీలలో 1380 దరఖాస్తులు రాగా.. నిర్మల్ మున్సిపాల్టీలో 675 అభ్యంతరాలు, ఖానాపూర్‌లో 570, భైంసాలో 135 అభ్యంతరాలు వచ్చాయి. అయినప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు ఎంఐఎం పార్టీల నేతలు ముసాయిదా జాబితాతో తలలు పట్టుకుంటున్నారు. అభ్యంతరాలను విన్నవించడంతో కొంత మేరకు శాంతించినా తుది జాబితా సక్రమంగా వెలువడేనా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వార్డులవారీగా ఓటరు లిస్ట్ సక్రమంగా ఉండేనా? అనే ఆందోళన మరో పక్క ఉంది.



**ఈనెల 12 తుది జాబితా విడుదల..**

మూడు మున్సిపాల్టీలలో ఓటరు జాబితా తప్పుల తడకగా ఉండగా.. వాటిని సవరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. క్షుణ్ణంగా పరిశీలించి ఇతర వార్డుల ఓట్లు, ఇతర గ్రామాల ఓటర్లను తీసివేసి స్థానికుల ఓట్లను జాబితాలో సక్రమంగా చేయనున్నారు. ఆయా వార్డుల బౌండరీలు, ఇంటి నంబర్ల వారీగా జాబితాను సవరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. తుది జాబితాను రేపు(సోమవారం) విడుదల చేయనున్నారు. కాగా.. అభ్యంతరాలను శుక్రవారం వరకు స్వీకరించామని, వాటిని సవరించి, ఈనెల 12వ తేదీన తుది జాబితాను విడుదల చేస్తామని నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు.


## నిర్మల్‌లో బాలుడు అదృశ్యం

**నిర్మల్, జనవరి 10 (ప్రభాత సమాచారం)** పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన అనిల్ చంద్రకళల మూడేళ్ల కుమారుడు అశ్విన్ అదృశ్యమైనట్లు టౌన్ సీఐ నైలు నాయక్ తెలిపారు. శనివారం ఆరుబయట ఆడుకుంటున్న అశ్విన్ అదృశ్యం కాగా కుటుంబీకులు బాలుని ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినప్పటికీ దొరకకపోగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసామన్నారు.

## బ్రిడ్జి నిర్మాణానికి మరమ్మతులు

**నేరడిగొండ, జనవరి 10 (ప్రభాత సమాచారం)** నేరడిగొండ మండల కేంద్రంలోని మరమ్మతులు చేపట్టనున్న బ్రిడ్జిని యువజన కాంగ్రెస్ బోథ్ అసెంబ్లీ అధ్యక్షుడు పోతారెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఇవాళ పరిశీలించారు. పంట పొలాల్లోకి వెళ్లేందుకు వీలుగా త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. నాయకులు సద్దాం, రైతులు ఉన్నారు.







# హైమన్ డార్ఫ్ స్ఫూర్తితో పేదల కోసం గ్రంథలయం

## ఉద్యోగ రీత్యా ఆయనో పోలీస్ కానిస్టేబుల్... అడవి బిడ్డల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పోలీస్ అన్న

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

ఉద్యోగ రీత్యా ఆయనో పోలీస్ కానిస్టేబుల్. అటు ఉద్యోగం చేస్తూ...ఇటు సమాజ హితం కోసం పాటు పడుతూ... హైమన్ డార్ఫ్ బెట్టి ఏలిజీబెత్ స్మారక గ్రంథలయాన్ని ఏర్పాటు చేసి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇంట్లోనే గ్రంథలయం నడుపుతూ...ఇంటి ఆవరణలో పచ్చని మొక్కలను పెంచుతూ ప్రకృతితో మమేకమవుతున్నాడు. గోండు జాతిలో పుట్టిన ఆయన తన జాతి ప్రయోజనాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాడు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన దుర్వ సంతోష్ అనే పోలీస్ కానిస్టేబుల్ హైమన్ డార్ఫ్ బెట్టి ఏలిజీబెత్ స్మారక గ్రంథలయాన్ని ఏర్పాటు చేసి నిరుద్యోగ్యులతో పాటు నిరాశ్రయులకు తోచిన సహాయాన్ని అందించి అండగా నిలుస్తున్నాడు. ఆపద వస్తే నేనున్న అంటూ ముందుకు వస్తున్నాడు. మానవ శాస్త్రవేత హైమన్ డార్ఫ్ బెట్టి ఏలిజీబెత్‌లు తనకు ఆదర్శమని అంటున్నాడు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాలనే ధృఢ సంకల్పంతో ఇప్పటి వరకు 7 పుస్తకాలను



రచించాడు. పురాతన కాలంలో గోండు రాజుల వాడిన యాంటిక్ వస్తువులను గ్రంథలయంలో భద్రపరుస్తున్నాడు. ఉద్యోగ జీవితంలో నార్నూర్ గాదిగూడ మండలాల్లో విధులు నిర్వహించే సమయంలో యువతను మత్తు పదార్థాలపై అవగాహన కల్పించి, ఎన్నో కేసులను చేధించడం విశేషం. అటు ఉద్యోగం చేస్తూనే...ఇటు సమాజ హితం కోసం తన సేవలను పేద ప్రజల కోసం అంకితం చేస్తున్నాడు.

**చెట్లే జీవకోటికి జీవనాధారం**

చెట్లే జీవకోటికి జీవనాధారమని ప్రతి ఇంటి ఆవరణతో పాటు పరిసరాల్లో మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచిస్తున్నాడు. కాలుష్యాన్ని తగ్గించాలనే



ప్రతి ఒక్కరూ జీవ వైవిధ్యాన్ని కాపాడాలని అంటున్నాడు.













### క్రీడాకారులను ప్రోత్సహించేందుకు

# వెంకటస్వామి మెమోరియల్

**మందమర్రి, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
పట్టణ, గ్రామీణ ప్రాం తంలో ఉన్న క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, విశాఖ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో దివంగత కాకా వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక ఉపాధికల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం వరంగల్‌లో జరుగుతున్న కాకా మెమోరియల్ టి20 క్రికెట్ లీగ్ సెకండ్ ఫేజ్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు కరచాలనం అందించి పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు హైదరాబాద్ కేంద్రంగానే ఐపీఎల్ పోటీలు జరిగాయన్నారు. జిల్లాలకు పెద్దగా ప్రాధాన్యత దక్కగపోయేదని తెలిపారు. తాను హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో మారుమూల గ్రామీ ణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర స్థాయిలో రాణించే లక్ష్యం గా తెలంగాణ క్రికెట్‌లీగ్ పోటీలు ఏర్పాటు చేశానన్నారు. గతంలో ఆ పోటీలు నిర్వహించిన సమయంలో గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విజయం సాధించిందన్నారు. ఆ తరువాత మరిన్ని పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించా లనే సంకల్పంతో తమ తండ్రి పేరిట మెమోరియల్ పోటీలు ప్రారంభించామని తెలిపారు. ఈ పోటీలు ఐపీఎల్ తరహాలో జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి మ్యాచ్‌ను 20 నుంచి30వేల మంది వీక్షిస్తున్నారన్నారు. అనంతరం హైదరాబాద్ వరంగల్ జట్ల సంబంధించి టాస్‌వేసి పోటీలను ప్రారంభించారు. కొంత సేపు బౌలింగ్, బ్యాటింగ్ చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజ్‌సారయ్య, వరంగల్ క్రికెట్ అసోసి యేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



### పోలింగ్ కేంద్రాలను

## పరిశీలించిన అధికారులు

**బెల్లంపల్లి, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
రానున్న మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఏర్పాట్ల సలహాల్లో అధికారులు నిమగ్నమయ్యారు. అందులో భాగంగా శనివారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సీఐ కే.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ పోలింగ్ కేంద్రాలని పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ముందస్తుగానే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేస్తున్నారు. నిర్దేశించిన పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. క్లిష్టమైన సాధారణ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో "అస్యూర్డ్ మినిమమ్ ఫెసిలిటీస్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని తనిఖీ చేసారు. ఈ తనిఖీలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో శుభ్రత, నీరు, విద్యుత్, షేడ్, సీట్లు, ర్యాంప్ (అవసరమైన చోట), టోయిలెట్లు సౌకర్యాలు అమలు తీరును పరిశీలించారు. క్లిష్టమైన ప్రాంతాల్లో అదనపు భద్రత ఏర్పాట్లు కూడా చేస్తమన్నారు. ఈ మున్సిపల్ సిబ్బంది అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా, శాంతియుతంగా జరగడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయనీ తెలిపారు.

## పండుగకు ఊరు వెళ్తున్నారా జాగ్రత్త

**నిర్మల్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాలో దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. పండుగ సమయంలో ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్లే సమయంలో ఖాళీగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశం ఉందని, కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంట్లో ఉన్న నగదు, బంగారం, విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు.

## క్రీడా పోటీలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి

**ముథోల్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
క్రీడా పోటీలో క్రీడాకారులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని తెలంగాణ జనసమితి ముథోల్ నియోజకవర్గం ఇంచార్జి సర్దార్ వినోద్ కుమార్, సర్పంచ్ నక్క మల్లేష్ లు అన్నారు. ముథోల్ మండలంలోని రువ్వి గ్రామంలో అట్టహాసంగా క్రికెట్ క్రీడ మ్యాచ్ పోటీలను శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. క్రీడా పోటీల వల్ల పోటీతత్వం పెరుగుతుంది అన్నారు. క్రీడా లు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో గన్నోర, బ్రహ్మాన్ గావ్ సర్పంచులు అప్పల రాజు,మల్కనోల్ల మహేందర్ రెడ్డి, స్థానిక ఉప సర్పంచ్ సర్దార్ కునాల్ ,వార్డు సభ్యులు రాథోడ్



భీమ్ రావు,సర్దోల్ల దిగంబర్, గ్రామ పెద్దలు మధ్యల భోజన్న,ముడుగుల సత్య నారాయణ,సర్దోల్ల దేవిదాస్,పెద్ద కాపు దేవన్న,నక్క హన్మండ్లు, సర్దోల్ల తిరుపతి,జంగం మల్లేష్,క్రీడాకారులు జాదవ్ పీరు సింగ్, పాంచాల్ విలాస్, రమేష్, సంతోష్,ఉమా చరణ్, వెంకట్,రవి,మహేష్, సాయి కుమార్ సావుల మహేష్, నక్క దశరథ్ పాల్గొన్నారు.

## జాతీయ పురస్కారానికి మాడిశెట్టి ప్రశాంత్ ఎంపిక

**ఆసిఫాబాద్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో ఉత్తమ రక్తదాతలు, ఉత్తమ రక్తదాత మోటివేటర్లకు జాతీయ పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశవ్యాప్తంగా రక్తదాన కార్యక్రమాల్లో విశేష సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు, వ్యక్తులను ఈ కార్యక్రమంలో సత్కరించనున్నారు. 2025 సంవత్సరంలో అధిక సంఖ్యలో రక్తదాతలను సమీకరించి, రక్తం అవసరమైన అనేక మందికి ప్రాణాలు కాపాడడంలో కీలక పాత్ర పోషించిన వారికి ఈ పురస్కారాలు అందజేయనున్నారు. ఆసిఫాబాద్ జిల్లా నుంచి ప్రజాసేవకుడు, రక్తదాత, బ్లడ్ డొనర్ ఆర్గనైజర్ మరియు మోటివేటర్ మాడిశెట్టి ప్రశాంత్‌ను ఉత్తమ రక్తదాత మోటివేటర్ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ వేద ప్రకాష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి పురస్కారానికి మాడిశెట్టి ప్రశాంత్ ఎంపిక కావడంతో పలువురు అభినందించారు.



## ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై అవగాహన

**పెంచికల్‌పేట్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఎలుక పల్లి, బొంబాయిగూడ గ్రామ పంచాయతీలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ పైన రైతులకి రామచందర్,ఉమా మహేష్ సర్పంచుల అధ్యక్షతన అవగాహన కార్యక్రమం చేపట్టారు. భూమి ఉన్న ప్రతి ఒక్కరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వంశీ, రైతులు పాల్గొన్నారు.





### ఉపాధి హామీ చట్టాన్ని

## పునరుద్ధరించాలి

### వీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి
### డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

**ఆసిఫాబాద్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జ్ శ్యాం నాయక్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల్ల మంగతో కలిసి ఆమె మాట్లాడారు. గ్రామీణ పేదలు, కూలీలు, రైతుల జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలు ప్రజావ్యతిరేకమని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా కోట్లాది గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించబడుతోందని, అలాంటి చట్టాన్ని బలహీనపరచడం అన్యాయమని అన్నారు. వీబీజీ రామ్‌జీ చట్టం ద్వారా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పక్కనపెట్టి కార్పొరేట్‌కు అనుకూలమైన విధానాలను అమలు చేయాలనే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రజావ్యతిరేక విధానాలను విరమించుకొని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చోరీల నివారణకు చర్యలు పాటించాలి

**మంచిర్యాల, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో సెలవులు, వివాహాల కోసం ఇళ్లకు తాళం వేసి వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జూ అంబర్ కిషోర్ ఝా ఇవాళ సూచించారు. చోరీల నివారణకు స్వీయ రక్షణ చర్యలు పాటించాలన్నారు. ముఖ్యంగా ఇళ్ల వద్ద అమర్చిన సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా, లేదా, నైట్ విజన్ స్పష్టంగా ఉందా? అనే విషయాలను సరిచూసుకోవాలని తెలిపారు. నేరాల నియంత్రణలో సాంకేతికత కీలకమన్నారు.

## మందమర్రి పట్టణంలో 'ఆపరేషన్ స్మైల్ల టీం విస్తృత తనిఖీలు

**మందమర్రి, జనవరి 10 (ప్రభాత సమాచారం)**
మందమర్రి పట్టణంలో 'ఆపరేషన్ స్మైల్ల టీం శనివారం విస్తృత తనిఖీలు చేపట్టింది. షాపింగ్ మాల్స్, జి.మార్ట్ లలో బాల కార్మికులు, అనుమానాస్పదంగా తిరుగుతున్న పిల్లలపై నిఘా ఉంచారు. 6 నుండి 14 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు బాల కార్మికులుగా కనిపిస్తే వెంటనే టీం ఇంచార్జ్ ఎస్సై ఎన్.శ్రీనివాస్ కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం జనవరి 1 నుండి 31 వరకు కొనసాగుతుంది. ఈ తనిఖీలలో ఎస్సై ఎన్.శ్రీనివాస్ తో పాటు ఏఎస్ఐ తాజుద్దీన్, ఏఎస్ఐ రవి, హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, హెడ్ కానిస్టేబుల్ స్వప్న, చైల్డ్ డిపార్ట్మెంట్ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.





# ఓటీటీలోకి 'దండోరా'..

పల్లె కథగా ప్రేక్షకుల ముందుకువచ్చి ప్రశంసలు అందుకున్న చిత్రం 'దండోరా' గతేడాది చివర్లో విడుదలైన ఈ సినిమా ఇప్పుడు సంక్రాంతికి ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు వచ్చేస్తోంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ కానుంది. జనవరి 14 నుంచి అందుబాటులో ఉండనుంది. కేవలం తెలుగులో మాత్రమే విడుదలైన ఈ సినిమా ఇప్పుడు హిందీ, మలయాళం, కన్నడ, తమిళ భాషల్లోనూ స్ట్రీమింగ్ కానుంది శివాజీ ప్రధాన పాత్రలో మురళీకాంత్ తెరకెక్కించిన ఈ సినిమాలో నందు, నవదీప్, బిందు మాధవి తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు.కులవివక్ష వేళ్లూనుకుపోయిన ఓ పల్లెటూరు తుళ్లూరు. తెలంగాణకు చెందిన ఆ ఊరిలో అగ్ర కులానికి చెందిన ఓ మోతుబరి శివాజీ (శివాజీ) కూడా వివక్షకు గురవుతాడు. కన్న కొడుకు విష్ణు (నందు)తోనూ ఆయనకు మాటలుండవు. చివరకు ఆయన మరణించినా తన కుల సంఘం శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు చేయడానికి వీల్లేదని పెద్దలు తీర్మానిస్తారు. అసలు అగ్ర కులానికి చెందిన శివాజీని కుల పెద్దలు ఎందుకు బహిష్కరించారు? ఆయనకీ, శ్రీలత (బిందు మాధవి)కీ మధ్య సంబంధం ఏమిటి? ఊరిలో తక్కువ కులానికి చెందిన రవి (రవికృష్ణ) హత్యకు గురైన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ఎలాంటివి? శివాజీకి అంతిమ సంస్కారాల నిర్వహణ విషయంలో తలెత్తిన సంఘర్షణపై ఆయన కుటుంబ సభ్యులు, ఊరి సర్పంచ్ (నవదీప్) తీసుకున్న నిర్ణయం ఏమిటి? తదితర విషయాల్ని సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

# చీరకట్టులో సమంత సోయగాలు..



సమంత.. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా భారీ పాపులారిటీ అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇటీవల రెండవ వివాహం చేసుకొని కొత్త జీవితాన్ని మొదలుపెట్టింది. గత ఏడాది డిసెంబర్ 1న ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ఈషా యోగ ఫౌండేషన్ సమీపంలో ఉన్న లింగ భైరవి సన్నిధిలో ఏడు అడుగులు వేసింది. వివాహం అనంతరం సినిమాలపై ఫోటోస్ పెట్టింది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే ఈమె తెలుగులో నటిస్తున్న చిత్రం మా ఇంటి బంగారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై సహ నిర్మాతగా వ్యవహరిస్తూ ఉండగా.. ఈ చిత్రానికి సమంత భర్త రాజ్ నిడిమోరు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సమంతతో ఇదివరకే ఓ బేబీ సినిమా చేసిన డైరెక్టర్ నందిని రెడ్డి మరోసారి మా ఇంటి బంగారం అనే సినిమాకు దర్శకత్వం వహిస్తోంది. ఇక భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి జనవరి 9వ తేదీన ఈ సినిమా నుంచి టీజర్ ట్రైలర్ ను విడుదల చేశారు. ఇందులో సమంత ఒకవైపు కోడలిగా అత్తవారి మెప్పు పొందడానికి ప్రయత్నం చేస్తూనే.. మరొకవైపు యాక్షన్ పర్ఫామెన్స్ తో ఆకట్టుకుంది. ఈ టీజర్ ట్రైలర్ లాంచ్ లో భాగంగా థియేటర్లో సందడి చేసిన ఈమె తాజాగా అందుకు సంబంధించిన ఫోటోలను ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకుంది.సమంత విషయానికి వస్తే.. ఒకప్పుడు టాలీవుడ్ లో మహేష్ బాబు , అల్లు అర్జున్, రామ్ చరణ్, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. కెరియర్ పీక్స్ లో ఉండగానే నాగచైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకుంది. కానీ ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో పెళ్లైన నాలుగేళ్లకే విడిపోయి అందరిని ఆశ్చర్యపరిచారు. ఆ తర్వాత కాలంలో మయోసైటీస్ వ్యాధి బారిన పడి కొంతకాలం ఇండస్ట్రీకి కూడా దూరమయింది సమంత. ఇక తర్వాత తన ఆరోగ్యాన్ని చక్కబెట్టుకొని ఇప్పుడు మళ్ళీ వెబ్ సిరీస్ లు సినిమాలు చేస్తూ బిజీగా మారిపోయింది. ఇకపోతే శుభం సినిమాతో తెలుగులో సినిమా తీసి నిర్మాతగా సక్సెస్ అందుకున్న ఈమె.. ఇలాగే ఒక వైపు హీరోయిన్గా మరొకవైపు నిర్మాతగా మరింత సక్సెస్ అవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# టాలీవుడే దిక్కంటున్న పెద్ది బ్యూటీ..




అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగ ప్రవేశం చేయడం అంటే సామాన్యమైన విషయం కాదు. భారీ అంచనాలు, కోట్లాది మంది అభిమానుల నిరీక్షణ మధ్య ధడక్ సినిమాతో జాన్వీ కపూర్ (Janhvi Kapoor) బాలీవుడ్ వెండితెరపై బాగానే మెరిసింది. తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ ముద్దుగుమ్మ, ఆ తర్వాత వరుస ప్రాజెక్టులతో బిజీగా మారింది. అయితే గడిచిన ఏడేళ్ల కెరీర్‌ను ఒక్కసారి విశ్లేషిస్తే, ఆమె ఖాతాలో చెప్పుకోదగ్గ భారీ విజయాలు నమోదు కాలేదనే చెప్పాలి. గ్లామర్ పరంగా సోషల్ మీడియాను షేక్ చేస్తున్నా బాక్సాఫీస్ వద్ద మాత్రం జాన్వీకి నిరాశే ఎదురవుతోంది. ఇలాంటి తరుణంలో ఆమెకు టాలీవుడ్ దిక్కు కానుందని టాక్ వినిపిస్తుంది.హిందీలో ఆశించిన స్థాయిలో సక్సెస్ రాకపోవడంతో, జాన్వీ తన రూటు మార్చింది. తన తల్లికి లైఫ్ ఇచ్చిన టాలీవుడ్ లోనే తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా వచ్చిన దేవర సినిమా ఆమెకు ఒక ఊపిరి పోసింది. ఎన్టీఆర్ సరసన తంగం పాత్రలో నటించి తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. గ్లామర్ తో పాటు నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు చేయడం ద్వారానే ఇక్కడ నిలదొక్కుకోగలమని ఆమె గ్రహించినట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు తన ఆశలన్నీ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సినిమా పెద్ది పైనే పెట్టుకుంది.ప్రస్తుతం జాన్వీ కపూర్ కెరీర్ లో అత్యంత కీలకమైన చిత్రం పెద్ది. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ అచ్చియమ్మ అనే పల్లెటూరి యువతి పాత్రలో నటిస్తోంది. ఈ పాత్ర కోసం జాన్వీ తన లుక్ ను పూర్తిగా మార్చుకోవడమే కాకుండా, నటనలో కొత్త కోణాన్ని చూపించడానికి సిద్ధమైంది. కేవలం అందాల ప్రదర్శనకే పరిమితం కాకుండా, ఒక నటిగా తన సత్తా ఏంటో నిరూపించుకోవడానికి ఇది ఆమెకు ఆఖరి అవకాశం అని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇక ఇప్పటికే విడుదలైన చికిరి చికిరి సాంగ్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. జాన్వీ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్ చూస్తుంటే, ఈ సినిమాతో ఆమె టాలీవుడ్ లో టాప్ హీరోయిన్ రేసులోకి వెళ్లడం ఖాయమనిపిస్తోంది. బాలీవుడ్ లో ఎన్నో ప్రయత్నాలు చేసినా దక్కని గుర్తింపును, టాలీవుడ్ అందిస్తుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అమ్మ శ్రీదేవి లాగే సౌత్ ఇండస్ట్రీని ఏలుతుందా..? లేక కేవలం గ్లామర్ స్టార్‌గానే మిగిలిపోతుందా అన్న సందేహాలకు పెద్ది సినిమానే సమాధానం చెప్పాలి. సినిమా రిజల్ట్ తేడా కొడితే జాన్వీ కెరీర్ ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందుకే ఈ సినిమా విజయం కోసం ఆమె రాత్రింబవళ్లు కష్టపడుతోంది. మరి అచ్చియమ్మగా జాన్వీ మాయ చేస్తుందో లేదో చూడాలి.



# 'టాక్సిక్' కాంట్రవర్సీ..

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా మొత్తం ఐదుగురు హీరోయిన్స్ కాంబినేషన్ లో దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కించిన భారీ చిత్రం "టాక్సిక్" కోసం అందరికీ తెలిసిందే. ఎప్పుడో మొదలైన ఈ సినిమా ఎట్టకేలకి టీజర్ గ్లింప్స్ తో ఒక బ్లాస్ట్ లాంటి ట్రీట్ ని పాన్ ఇండియా లెవెల్ ఆడియెన్స్ కి అందించింది.అయితే ఈ టీజర్ లో మాత్రం ఓ అడల్ట్ సీన్ పై ఇప్పటికీ విమర్శలు వస్తున్నాయి. అలాంటి సీన్ ఎందుకు పెట్టారని థియేటర్స్ లో ఇళ్లలో ఇలాంటి సినిమాలు టీజర్ లు ఎలా చూడాలనే కామెంట్స్ యువతలో కూడా వచ్చాయి. అయితే ఇప్పుడు ఇలాంటి సీన్స్ కి సంబంధించి యష్ పై ఓ పాత స్టేట్మెంట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.కన్నడ లోనే ఓ టెలివిజన్ ప్రోగ్రాం కి అటెండ్ అయ్యిన యష్ అందులో మాట్లాడుతూ 'తన తల్లిదండ్రులతో కలిసి చూడలేని సన్నివేశాలు ఉన్న సినిమాలు నేను చేయను' అంటూ చెప్పిన స్టేట్మెంట్ ని నెటిజన్స్ బయటకి తీసుకొచ్చారు. బహుశా యష్ ఈ స్టేట్మెంట్ ని మర్చిపోయి ఉంటాడు అంటూ తనపై విమర్శలు చేస్తున్నారు. దీనితో ఈ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.





# విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

## నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ మ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఇంద్రవెల్లి, జనవరి 10 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ...ఉన్నత శిఖరాలకు ఎదగాలని నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో సీఎం క్రీడా కప్ ర్యాలీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, క్రీడల వల్ల శారీరిక దృఢత్వం కలిగి ఉండడంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం ఇంద్రవెల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, ఏంఈవో మణుకుమార్, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

**రక్త దానంతో ఓ నిండు ప్రాణాన్ని కాపాడగలం...**

ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం వల్ల ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన వాళ్ళమవుతామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామంలో జేసీఎన్ ఎడ్యుకేషనల్ సొసైటీ తరుపున ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిభిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపు నిచ్చారు.


**నాగోబా ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది..**

నాగోబా ఆలయ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో కొలువుదీరిన నాగోబాను దర్శించుకున్నారు. ఈనెల 18నుండి జరగనున్న నాగోబా జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గత ప్రభుత్వం నాగోబా ఆలయ అభివృద్ధికి రూ. 6కోట్ల నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులు పూర్తి చేసిన గుత్తేదారునికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలేదన్నారు. నేను బాధ్యతలు స్వీకరించిన తర్వాత 2లక్షల నిధులు సంబంధిత గుత్తేదారునికి ఇప్పించానని తెలిపారు. వచ్చే జాతర కల్ల 15కోట్లతో ముత్నూర్ నుండి కేస్లాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాగోబా జాతర దర్బార్ కు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు వస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీడీ అంబాజీ, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ఏటీడబ్ల్యూవో సదానందం, కేస్లాపూర్ సర్పంచ్ మెస్రం తుకారాం, నాగోబా ఆలయ చైర్మన్ మెస్రం ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# ఉపాధి హామీ నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర



## నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, మ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**నిర్మల్, జనవరి 10 (ప్రభాత సమాచారం)**

దేశంలో పేదలకు ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పండుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షలు పటేల్ ధ్వజమెత్తారు. భారతదేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ పేరు తొలగించి రాంజీ పేరు ప్రతిబింబించేలా ఉపాధి హామీ పథకాన్ని మార్చడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకంపై మోడీ ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చి సంపన్నులకు కొమ్ము కాసే విధంగా వివరిస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకం నిబంధనలు మార్చడానికి నిరసిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపడుతుందని ఈనెల 20 నుంచి నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. గ్రామ సభలో తీర్మానం చేసి ఉపాధి హామీ కూలీలకు పని భద్రత కల్పించే విధంగా కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. దేశ సంపదను కొందరు బడా వ్యక్తులకు అప్పగించేందుకు కేంద్రం కుట్ర పడుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండి పోరాడాలన్నారు.

**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దే విజయం...**

త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో నిర్మల్ జిల్లాలో నిర్మల్ బైంసా ఖానాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని డిసిసి అధ్యక్షలు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడుమ బుజ్జి పటేల్ అన్నారు. శనివారం నిర్మల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ మద్దతుదారులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించాలని ఇదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లో ముందుకు పోతున్నామన్నారు. నిర్మల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన మహేశ్వర్ రెడ్డి నిర్మల్ అభివృద్ధిని విస్మరించి హైదరాబాదులో ఉంటూ ప్రభుత్వం పై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బిజెపి ఎమ్మెల్యేలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నందున ఆ పార్టీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. నిర్మల్ ప్రజలకు బిజెపి వల్ల ఒరిగింది ఏమి లేదని రెండు సంవత్సరాల కాలంలో కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా తీసుకు రాలేదని ధ్వజమెత్తారు దీన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు శ్రీహరి రావు అర్జుమంత్ అలీ భీమ్ రెడ్డి అబ్దుల్ ఆది నాందేడ్ చిన్ను గణేష్ చక్రవర్తి కృష్ణవేణి పాల్గొన్నారు.